# చాణక్యుని నీతి సూత్రములు



అనువాదం

సబ్బని లక్ష్మీనారాయణ

# అధ్యాయం - 1

మూడు లోకాలకు ప్రభువైన విష్ణుదేవుడికి శిరసువంచి నమస్కరించి, నానా శాస్త్రముల నుండి సంగ్రహించిన ఈ నీతి, రాజనీతి విషయాలను అందిస్తున్నాను.

★ ★ ★ ★

ఈ సూత్రాలు చదివినవారు కార్యాకార్యములు, శుభాశుభములు తెలిసినవారై మంచి చెడులను గ్రహించి లోకంలో ఉత్తమ మానవులుగా కొనియాడబడుతారు.

★ ★ ★ ★

దేనిని స్వీకరించుటచే సర్వజ్ఞత్వం సిద్ధిస్తుందో, అట్టి జ్ఞానాన్ని లోకహితం కోరి అందిస్తున్నాను.

★ ★ ★ ★

మూర్ఖుడైన శిష్యునికి హితోపదేశం చేయడం వలన మరియు దుష్టురాలైన స్త్రీని భరించడం వలన జ్ఞాని అయిన వాడు కూడా దుఃఖమును పొంది బాధను ఎదుర్కొనవల్సివస్తుంది.

★ ★ ★ ★

దుష్టురాలైన భార్య, మూర్ఖుడైన స్నేహితుడు, అవిధేయుడైన సేవకుడు, ఇంట్లో చొరబడ్డ పాము మరణానికి హేతువులు. ఇందులో సందేహం లేదు.

★ ★ ★ ★

ఎవరైనా కష్టకాలమొస్తుందేమోనని తెలిసి ధనం పొదుపు చేసి కాపాడుకోవాలి. అలానే భార్యను ధనం కన్నా సురక్షితంగా కాపాడుకోవాలి. ఇంకా తనను తాను ఎల్లప్పుడు ధనం కంటే, భార్య కంటే కూడా సురక్షితంగా కాపాడుకోవాలి.

★ ★ ★ ★

ఆపదల కొసం డబ్బును జమ చేసుకోవాలి. ధనవంతుడికి ఆపదలు ఎక్కడివి? అయినా ధనలక్ష్మి స్థిరంగా ఉండదు, ఎప్పుడో ఒకసారి లక్ష్మి వెళ్ళిపోవడం చేత కూడబెట్టుకొన్న ధనమంతా కూడా తెలియకుండా కరిగిపోతుంది.

★ ★ ★ ★

ఏ దేశంనందైతే గౌరవం, ఉపాధి, బంధువులు, విద్వాంసులు ఉండరో అక్కడ ఉండకూడదు.

★ ★ ★ ★

ధనికుడు, శ్రోత్రియుడు, రాజు, నది, వైద్యుడు ఈ అయిదు చాలా అవసరం మనిషికి. అవి లేని చోట ఒక్కరోజైనా ఉండకూడదు.

# అధ్యాయం - 2

అసత్యం, సాహసం, మాయ, మూర్ఖత్వం, మలినతత్వం, లోభం, నిర్దయత్వం అనేవి స్త్రీ యొక్క సహజ దోషాలు.

★ ★ ★ ★

భోజ్యంకు భుజించు శక్తి, శ్రేష్టమైన స్త్రీని రతిలో రంజింపజేసే శక్తి ,సంపదలుంటే దానం చేసే శక్తి అనునవి గొప్పనైన తపస్సు యొక్క ఫలాలు.

★ ★ ★ ★

వశీభూతుడైన కుమారుడు, భర్తను అనుసరించే భార్య, వైభవములయందు సంతృప్తి కలవాడు స్వర్గంలో ఉన్నంత సమానం.

★ ★ ★ ★

ఎవరైతే పితృభక్తి గలవారో వారే అసలైన పుత్రులు, ఎవరైతే పుత్రులను సక్రమంగా పెంచుతారో వారే నిజమైన తండ్రి. విశ్వాసం గల నమ్మదగిన మిత్రుడే మిత్రుడు, ఎవరి సాహచర్యంలో తృప్తిగా, సంతోషంగా గడుపుతాడో పురుషుడు ఆమెనే భార్య అతనికి.

★ ★ ★ ★

ప్రత్యక్షంగా ప్రియవచనాలు పలికి, పరోక్షంగా కార్య విఘ్నం కలిగించే పయోముఖ విషపుకుంభం లాంటి మిత్రున్ని వదిలివేయాలి.

★ ★ ★ ★

చెడ్డ మిత్రున్ని, మంచి మిత్రున్ని కూడా విశ్వసించవద్దు. ఎప్పుడైనా నీ మీద కోపం వచ్చినపుడు నీ రహస్యాలు అన్నీ బట్టబయలు చేస్తాడు.

★ ★ ★ ★

మనసులో అనుకొన్న పనిని మాటల్లో ప్రకటించకూడదు. ఆ విషయాలను మంత్రాల్లాగా మనసులో దాచి పెట్టుకోవాలి. ఎలాంటి ప్రచారం పటాటోపం లేకుండా ఆ పనులను కార్యరూపంలో పెట్టి సాధించాలి. మంత్రాంగంతో రహస్యాన్ని రక్షించుకొని కార్యాన్ని సాధించుకోవాలి.

★ ★ ★ ★

మూర్ఖత్వమే కష్టం , యవ్వనమే కష్టం కాని కష్టంలకంటే కష్టమైనది పరగృహంలో నివాసం చేయడం.

★ ★ ★ ★

ప్రతి పర్వతం మీద మణులు దొరుకవు. అలానే ప్రతి ఏనుగు ముఖం పై ముత్యాలు పొదిగి ఉండవు. అలానే సాధుగుణం గలవారు ప్రతి చోటా ఉండరు. ప్రతి అడవిలో గంధపు చెట్లు ఉండవు కదా!

# అధ్యాయం - 3

ఈ భూప్రపంచం మీద కళంకములు మోయని కుటుంబం ఉంటుందా? వ్యాధి పీడితులు కాని వారు ఉంటారా? వ్యసనాన్ని పొందనివారు ఉంటారా? నిరంతర సౌఖ్యాన్ని పొందేవారు ఎవరైనా ఉన్నారా? (మానవ జీవితంలో కష్టాలు, సుఖాలు సర్వసాధారణం అని అర్థం)

★ ★ ★ ★

వ్యక్తి యొక్క ఆచారాలను బట్టి కులాన్ని, అతని భాష,మాటను బట్టి దేశాన్ని అతని అద్వితీయాతానురాగాలను బట్టి స్నేహాన్ని మరియు అతను తీసుకునే ఆహారాన్ని బట్టి అతని శరీరాన్ని చెప్పవచ్చు.

★ ★ ★ ★

నీ కూతురును మంచి కుటుంబలోకి ఇచ్చి కన్యాదానం చేయి, నీ కొడుకుకు మంచి విద్యాబుద్ధులు నేర్పించు, నీ మిత్రులను మంచి పనుల్లో ఉండేట్టు చూడు. నీ శత్రువును చెడు పనుల్లో నియుక్తమయ్యేట్టు చూడు.

★ ★ ★ ★

దుర్జనుడు, సర్పం రెండింటిలో ఏది ఎక్కువ చెడ్డది అంటే దుర్జనుడే. సర్పం ఒకేసారి కాటు వేస్తుంది. కాని దుర్జనుడు ప్రతి సారి కాటు వేస్తాడు.

★ ★ ★ ★

రాజులు ఉత్తమ గుణం గలవారిని తమ వద్ద ఉంచుకుంటారు, వారిని ఆది మధ్య అవసాన దశలలో వదలిపెట్టరు.

★ ★ ★ ★

ప్రళయకాలంలో సముద్రాలు తమ అవధులు దాటి కదులుతాయి. కాని సజ్జనులైనా వారు మాత్రం ఎప్పుడును తమ అవధులు దాటి మెలగరు, ప్రవర్తించరు.

★ ★ ★ ★

మూర్ఖుడైన మనిషిని దూరంగా ఉంచడం మంచిది, ఎందుకంటే అతడు రెండు కాళ్ళ పశువుతో సమానం. కంటికి కనిపించని ముళ్ళ వలె అతడు తన మాటల ఈటెలతో మన హృదయాన్ని గాయం చేస్తుంటాడు.

★ ★ ★ ★

రూప యవ్వన సంపన్నుడైనప్పటికినీ, ఉన్నత కుటుంబంలో పుట్టినవాడు అయినప్పటికినీ, చదువురాని మనిషి అయితే అలాంటివాడు పరిమళం లేని రంగు మాత్రమే ఉన్న మోదుగ పువ్వులాంటి వాడు.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Chanakyuni+Neeti+Sutramulu**

* * *